7

సాక్షి విశాఖపట్నం

గురువారం । 10 । ఆగస్టు । 2023

న్యూస్‌రీల్

ఇంటింటా ఓటరు సర్వే 51.46 శాతం పూర్తి



మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: ఓటర్ల జాబితా ఇంటింటా సర్వే ప్రక్రియ 51.46% పూర్తయిందని జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ తెలిపారు. బుధవారం తన చాంబర్‌లో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఇంటింటి సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ నాటికి జిల్లాలో ఇంటింటా సర్వే పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు స్పష్టం చేశారు. భార్యాభర్తలు వివిధ పోలింగ్ స్టేషన్‌లో ఓటరుగా నమోదై ఉన్నా.. ఓటర్ల జాబితాలో చేర్చకపోయినా, 18 సంవత్సరాలు నిండి ఓటరుగా నమోదుకాకపోయినా బీఎల్‌వో వారి ఇంటిని సందర్శించినప్పుడు నవీకరించడం కోసం సహకరించాలన్నారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులు తలెత్తిన సమస్యలను నివృత్తి చేశారు. సమావేశంలో డీఆర్వో శ్రీనివాస మూర్తి, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్ రెడ్డి, ఈఆర్‌వోలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం రూ.19 లక్షలు



హుండీ లెక్కింపులో పాల్గొన్న ఆలయ సిబ్బంది

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి ఆలయ హుండీ లెక్కింపు బుధవారం చేపట్టారు. గత నెల 10 నుంచి ఈ నెల 9 వరకు హుండీల ద్వారా వచ్చే ఆదాయాన్ని లెక్కించారు. రూ.19.36 లక్షలు, 77.10 గ్రాముల బంగారం, 320.20 గ్రాముల వెండి లభించింది. అలాగే 44 అమెరికా డాలర్లు, ఖతర్ సెంట్రల్ బ్యాంక్‌కు చెందిన 10 రియల్ వచ్చాయి. లెక్కింపులో ఉప కమిషనర్, ఆలయ కార్యనిర్వహణాధికారి శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు సత్య రూపవాణి, సుబ్రహ్మణ్యం, సురేష్, ధనలత, మారుతీప్రసాద్, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి తిరుమలేశ్వరరావు, జగన్నాథరావు, మొట్టమర్రి చిన్న సన్యాసయ్య, శ్రీహరిసేవ సంఘం సభ్యులు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహాయ మేనేజర్ ప్రశాంత్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక వైద్యశాల విద్యార్థిని చందన ప్రతిభ


పీజీ పరీక్షల్లో మొదటి స్థానం



చందన

ఏయూక్యాంపస్: ఆంధ్ర వైద్య కళాశాల అనుబంధ ప్రభుత్వ మానసిక వైద్యశాలలో విద్యనభ్యసిస్తున్న ఎండీ సైకియాట్రీ విభాగం విద్యార్థిని ఎస్.చందన పీజీ పరీక్షల్లో 458 మార్కులు సాధించింది. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పరిధిలో జరిగిన పీజీ పరీక్షల్లో సైకియాట్రీ విభాగంలో ఆమె అత్యధిక మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఆమెను ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.వి రామిరెడ్డి, మానసిక వైద్య విభాగాధిపతి వి.విజయలక్ష్మి అభినందించారు. తమ విద్యార్థి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. మూడేళ్లుగా తమ విద్యార్థులు ప్రథమ స్థానం సాధిస్తున్నారని చెప్పారు. పలువురు వైద్యులు, అధ్యాపక బృందం ఆమెకు అభినందనలు తెలిపారు.

పీజీ అడ్మిషన్లు ప్రారంభం



పీజీలో చేరిన విద్యార్థినికి ధ్రువీకరణపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ బుచ్చిరాజు

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కళాశాలలో పీజీ అడ్మిషన్లు బుధవారం ప్రారంభమయ్యాయి. శతాబ్ది సంవత్సరంలో మొత్తం 318 పీజీ సీట్లు భర్తీ చేస్తున్నారు. ఇందులో 115 పీజీ సీట్లు ఈ విద్యా సంవత్సరం నుంచి పెరిగాయి. ఆల్ ఇండియా కోటా(ఏఐక్యూ)లో కేటాయించిన పీజీ సీట్లను ముందుగా భర్తీ చేస్తున్నారు. నోయిడాకు చెందిన డాక్టర్ సారా దబ్రాల్(ఏఐక్యూ ర్యాంక్ 12,017) ఎండీ సైకియాట్రీ పీజీలో జాయిన్ అయ్యారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు ఆమెకు ప్రవేశ ధ్రువీకరణపత్రం అందజేశారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో దూకుడు

- ఎకో–వైజాగ్ ప్రచారానికి పట్టం కట్టిన నగర ప్రజలు
- బుధవారం నాటికి 6,20,144 మంది ఫీడ్‌బ్యాక్
- 5,68,388 మందితో తర్వాతి స్థానంలో ఇండోర్
- ఈ నెల 16 వరకు అభిప్రాయాలు తెలపవచ్చు
- ఫస్ట్ ర్యాంక్‌లో నిలిచేందుకు సహకరించాలని మేయర్, కమిషనర్ పిలుపు

స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో విశాఖ నగరం దూకుడు ప్రదర్శిస్తోంది. ఎకో వైజాగ్ ప్రచారానికి పట్టం కట్టిన నగర ప్రజలు.. కీలకమైన ప్రజాభిప్రాయ సేకరణలో స్పందిస్తున్న తీరు అమోఘం. బుధవారం మధ్యాహ్నం నాటికి 6,20,144 మంది ఫీడ్ బ్యాక్‌తో దేశంలోనే విశాఖ టాప్‌గా ఉంది. ఇదే స్థానంలో కొనసాగాలంటే అందరి సహకారం ముఖ్యం. ప్రజలు తమ అభిప్రాయాలు నమోదు చేయదానికి ఈ నెల 16వ తేదీ వరకు గడువు ఉంది. విశాఖను సుందర నగరంగానే గాక అత్యున్నత ప్రమాణాలు కలిగిన నగరంగా తీర్చిదిద్దుతున్న జీవీఎంసీ దృఢ సంకల్పానికి జై కొట్టాల్సిన సమయం ఇదే.. – దాబాగార్డెన్స్

సుందర నగరి.. సిటీ ఆఫ్ డెస్టినీ.. ఇలా ఎన్నో పేర్లను సంపాదించుకున్న విశాఖ మహా నగరం.. స్వచ్ఛత విషయంలోనూ పరుగులెడుతోంది. స్వచ్ఛ సర్వేక్షణ్–2022లో 4,355 నగరాలతో పోటీ పడి.. జాతీయ స్థాయిలో 4వ స్థానాన్ని దక్కించుకుని సగర్వంగా నిలిచింది. ఈ సారి అదే జోరు కొనసాగిస్తోంది. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నగరాన్ని అగ్ర భాగాన నిలబెట్టేందుకు ప్రజలే కీలక పాత్ర పోషించాల్సిన తరుణంలో.. వైజాగ్ వాసులు విశేషంగా స్పందిస్తున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో విశాఖ 6,20,144 మంది ఫీడ్‌బ్యాక్‌తో టాప్‌లో ఉంది. ఈ నెల 9వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓట్ ఫర్ యువర్ సిటీ వెబ్‌లో 4,25,803, ఓట్ ఫర్ యువర్ సిటీ యాప్‌లో 83,407, స్వచ్ఛత యాప్‌లో 1,10,934 మొత్తంగా 6,20,144 మంది ఫీడ్‌బ్యాక్ ఇచ్చారు. తర్వాత స్థానాల్లో ఇండోర్ (5,68,388 మంది), భోపాల్(5,36,019), గ్వాలియర్(2,54,664), ఉజ్జయిని(1,84,360) ఉన్నాయి.



పార్కును సందర్శిస్తున్న మేయర్ (ఫైల్)



విద్యుత్ ధగధగలతో వైజాగ్ స్క్వేర్

ఫీడ్ బ్యాక్ ఇవ్వండి ఇలా..



స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో భాగంగా సర్వీస్ లెవెల్ ప్రోగ్రెస్ విభాగంలో 4,525 మార్కులు, సర్టిఫికేషన్ విభాగంలో 2,500 మార్కులు, సిటిజన్ వాయిస్ విభాగంలో 2,475 మార్కులు.. మొత్తంగా 9500 మార్కులకు కేంద్రం పోటీ నిర్వహిస్తోంది. ఫీడ్ బ్యాక్ విభాగంలో ప్రస్తుతం విశాఖ టాప్‌లో ఉంది. ఈ నెల 16వ తేదీ వరకు ప్రజలు తమ అభిప్రాయాలు ఇలా తెలియజేయవచ్చు.

- vfcity-prod.sbmurban.org
- voteforyourcity2023(యాప్)
- స్వచ్ఛతా యాప్
- voteforyourcity పోర్టల్
- https://www.mygov.in
- https://sbmurban.org

వినూత్నంగా ఎకో- వైజాగ్



ప్రపంచంలోనే అత్యుత్తమ సమతుల్యత, సుస్థిర అభివృద్ధి కలిగిన నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు జీవీఎంసీ జూన్ 5, 2023న ఎకో–వైజాగ్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమం ద్వారా ఎకో–క్లీన్, ఎకో–గ్రీన్, ఎకో–బ్లూ, ఎకో–జీరో ప్లాస్టిక్, ఎకో–జీరో పొల్యూషన్ అనే థీమ్స్‌తో దీర్ఘకాలిక లక్ష్యాలతో ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలతో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధాన్ని పటిష్టంగా అమలు చేస్తోంది. నగరంలో కాలుష్య నివారణకు 65 ఎలక్ట్రానిక్ ఆటోలు వినియోగంలోకి తీసుకొచ్చింది. ఆర్ఆర్ఆర్ సెంటర్లను నెలకొల్పుతూ.. వ్యర్థాలను పునర్వినియోగిస్తోంది. తడి, పొడి చెత్తను ఇంటి వద్దనే సేకరించే కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేస్తోంది.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం



పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్నాం. నగరంలోని ప్రధాన గెడ్డలపై రోడ్లకిరువైపులా ఉన్న కల్వర్టుల వద్ద ఆకర్షణీయంగా ఆ ప్రాంత పేరును తెలుపుతూ వ్యర్థాలతో నమూనాలు ఏర్పాటు చేస్తున్నాం. నగరంలోని 44 ప్రధాన గెడ్డల వద్ద ఆకర్షణీయంగా ఆకృతులు తీర్చిదిద్దేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో విశాఖ నగరాన్ని దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిపేందుకు అన్ని చర్యలు చేపడుతున్నాం. అందుకు నగర ప్రజల సహకారం ముఖ్యం. నగర పౌరులు తమ అమూల్యమైన అభిప్రాయాలను వెంటనే తెలియజేయాలి.

– సాయికాంత్ వర్మ, కమిషనర్, జీవీఎంసీ

నగర ప్రజలు సహకరించండి



కాలుష్య నియంత్రణలో భాగంగా ప్రతీ సోమవారం ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగిస్తున్నాం. ఎకో–వైజాగ్ పేరిట పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో గతేడాది 4వ స్థానంలో నిలిచాం. ఈ ఏడాది మొదటి స్థానంలో నిలిచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో విశాఖ మహా నగరం రోజురోజుకూ అభివృద్ధి చెందుతోంది. నగరాభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపడుతున్నాం. వైజాగ్ మొదటి ర్యాంక్ సాధించాలంటే.. పెద్ద ఎత్తున ఫీడ్ బ్యాక్ ఇవ్వాల్సి ఉంటుంది. నగర ప్రజలు విశాఖను ప్రథమ స్థానంలో నిలిపేందుకు సహకరించండి.

– గొలగాని హరి వెంకటకుమారి, మేయర్

రైల్వే ట్రాక్‌పై ఆగిన కారు

- ఢీకొట్టిన గూడ్స్ రైలు
- లోకో పైలట్ సమయస్ఫూర్తితో తప్పిన పెను ప్రమాదం



దెబ్బతిన్న కారు

అక్కిరెడ్డిపాలెం: మారుతీ జంక్షన్ వద్ద గల రైల్వే క్రాసింగ్ దాటుతున్న సమయంలో ట్రాక్‌పై కారు నిలిచిపోయింది. మారుతీ జంక్షన్ మీదుగా శ్రావణ్ షిప్పింగ్ వైపు వెళ్తున్న గూడ్స్ రైలు ఢీ కొట్టడంతో.. కారు ఎగిరి పక్కన పడింది. లోకో పైలట్ సమయస్ఫూర్తితో నలుగురు ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపిన వివరాలివీ.. గూడ్స్ రైలు విశాఖ పోర్టు ట్రస్ట్ నుంచి మారుతీ జంక్షన్ మీదుగా శ్రావణ్ షిప్పింగ్ గొడౌన్ల వైపు వెళ్తోంది. అదే సమయంలో ములసాగ హౌసింగ్ కాలనీ నుంచి నగరం వైపు ఓ కారు రైల్వే క్రాసింగ్ దాటుతోంది. ఆకస్మాత్తుగా కారు ట్రాక్‌పై నిలిచిపోవడంతో అటుగా వస్తున్న గూడ్స్ రైలు కారును ఢీ కొట్టింది. దీంతో కారు ఎగిరి రోడ్డుపై పడటంతో అందులో ఉన్న ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులకు స్వల్ప గాయాలయ్యాయి. ట్రాక్‌పై కారును గమనించిన లోకో పైలట్.. శాయశక్తులా వేగం తగ్గించడంతో పాటు కేబిన్ బయటకొచ్చి గట్టిగా అరిచినట్లు స్థానికులు తెలిపారు. గూడ్స్ వేగాన్ని నియంత్రించకపోతే ప్రాణనష్టం జరిగి ఉండేదని చెప్పారు. కారులో విశ్రాంత నేవీ కుటుంబం ప్రయాణిస్తున్నట్లు తెలిసింది. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ సతీష్ తెలిపారు.

రేపు మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈ నెల 11న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సిహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.శాంతి(టెక్నికల్) తెలిపారు. మెడ్‌ప్లస్, డైకిస్, సెంట్రల్ ఫార్మసీ, ది లివరేజ్ ప్రోవిన్స్, బ్లూస్టార్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఎక్స్ టెక్స్ టెస్టింగ్, ఆదాన్ సొల్యూషన్స్, టెక్నో సాఫ్ట్ సొల్యూషన్స్, హ్యూమన్ పవర్ సర్వీసెస్, సపోర్ట్ సర్వీసెస్, ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 545 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. కస్టమర్ అండ్ ఫీల్డ్ ట్రైనీ, సేల్స్ డెవలప్‌మెంట్ మేనేజర్, ఫార్మసిస్ట్, అసెంబ్లీ ఆపరేటింగ్ కాల్ అసిస్టెంట్, ఆపరేటర్, కస్టమర్ ఎగ్జిక్యూటివ్, కెమిస్ట్, క్యాషియర్, జూనియర్ క్యాడ్ ఇంజినీర్, కార్పెంటర్, వేర్‌హౌస్ అసోసియేట్స్, జీఐఎస్ ఇంజినీర్ క్యాడ్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, కేర్ టేకర్స్, సెక్యూరిటీ గార్డ్స్, బ్రాంచ్ గొడౌన్ ఇన్‌చార్జి, కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్, ఐటీఐ, బీటెక్, ఎంబీఏ పూర్తి చేసిన 18–38 ఏళ్ల వయసు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా ఉద్యోగాల బట్టి జీతం నెలకు రూ.10,000 నుంచి రూ.30,000 వరకు ఉంటుందన్నారు.

681 మంది.. రూ.4.24 కోట్లు

జిల్లాలో వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా లబ్ధిదారులకు నిధుల విడుదల



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, చిత్రంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఎమ్మెల్సీ రవీంద్రబాబు, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ చైర్‌పర్సన్ మంతెన మాధవి, నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత

మహారాణిపేట: వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫాతో వధూవరులకు ఆర్థిక లబ్ధి చేకూరనుందని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ పేర్కొన్నారు. వైఎస్సార్ కల్యాణ మస్తు, వైఎస్సార్ షాదీ తోఫా మూడో విడత నిధుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. జిల్లా స్థాయి కార్యక్రమం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలను నివారించడం, పిల్లల చదువులను ప్రోత్సహించడం, పేద కుటుంబాలకు చెందిన వధువుల తల్లిదండ్రులను ఆర్థికంగా ఆదుకోవడమే ఈ పథకం ఉద్దేశమన్నారు. పేద కుటుంబాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కలుగుతుందన్నారు. జిల్లాలో 681 మంది లబ్ధిదారులకు రూ.4.24 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 148 బీసీ–ఎ జంటలకు రూ.76.50 లక్షలు, 111 బీసీ–బి జంటలకు రూ.5.80 లక్షలు, మూడు భవన నిర్మాణ కార్మికుల జంటలకు 1.20 లక్షలు, ఆరు దివ్యాంగ జంటలకు రూ.9 లక్షలు, 24 మైనార్టీ జంటలకు రూ.24 లక్షలు మంజూరు అయ్యాయన్నారు. అనంతరం జిల్లాలో లబ్ధిదారులకు రూ.4.24 కోట్ల నమూనా చెక్కును ప్రజా ప్రతినిధులతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు, డీసీసీబీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్ వెస్లీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ చైర్‌పర్సన్ మంతెన మాధవి వర్మ, నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ కె.రామారావు, డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, వార్డు,గ్రామ సచివాలయ జిల్లా ఇన్‌చార్జి పూర్ణిమా దేవి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



బీసీ–డీ కులానికి చెందిన సీతారామ్‌ను వివాహం చేసుకున్నాను. వివాహం జరిగిన వెంటనే వలంటీర్, సచివాలయ సిబ్బంది వచ్చి వైఎస్సార్ కల్యాణ మస్తు కింద ఆర్థిక సహాయం ప్రభుత్వం అందిస్తుందని వివరించారు. వారు చెప్పిన విధంగానే సహాయం అందింది. ఈ ఆర్థిక సహాయం ఎంతగానో ఉపయోగపడుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

– సిహెచ్ శ్రావణి సరిపల్లి, పెందుర్తి మండలం

ఇంజినీరింగ్ ఆప్షన్ల గడువు పొడిగింపు

మురళీనగర్: ఏపీ ఈఏపీసెట్ ఇంజినీరింగ్ అడ్మిషన్లకు సంబంధించి వెబ్ ఆప్షన్లు గడువు పొడిగించినట్లు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు చెప్పారు. ఈ ఆప్షన్లకు ఈనెల 7వ తేదీ నుంచి 12వరకు మొదట అవకాశం ఇచ్చారు. అయితే విద్యార్థులకు మరింత అవకాశం కల్పించేందుకు ఈ గడువును ఈనెల 14వ తేదీ వరకు పొడిగించారు. ఆప్షన్లను ఈనెల 16న మార్పు చేసుకోవచ్చు. 23న సీట్ల కేటాయింపు, 23 నుంచి 31వ తేదీ వరకు వారికి కేటాయించిన కాలేజీలో సెల్ఫ్ జాయినింగ్ రిపోర్టు ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పెంపు

కొమ్మాది: రానున్న విద్యా సంవత్సరంలో నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువు ఈ నెల 17వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ సంజయ్ తెలిపారు. విద్యార్థులు https://navodaya.gov.inను సందర్శించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నీటి సంపులో దూకి తల్లీపిల్లల ఆత్మహత్య

- అపార్ట్‌మెంట్ వాచ్‌మన్ ఇంట విషాదం
- మద్రిపాలెం వుడా లేఅవుట్‌లో ఘటన



సంపు నుంచి బయటకు తీసిన మృత దేహాలు



భర్తతో సంధ్య, కొడుకు గౌతమ్, కూతురు అలేఖ్య(ఫైల్)



అపార్ట్‌మెంట్ వద్ద విచారిస్తున్న ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి

గోపాలపట్నం: నవమాసాలు కని పెంచిన ఆ తల్లికి ఏమైందో ఏమో.. తాను లేకుండా తన పిల్లలు ఎలా బతుకుతారనే తల్లి ప్రేమే కావచ్చు.. తనతో పాటే పిల్లల్ని మృత్యు ఒడిలోకి తీసుకెళ్లేలా చేసింది. అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారులతో సహా తల్లి నీటి సంపులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. జీవీఎంసీ 52వ వార్డు మద్రిపాలెం వుడా లేఅవుట్‌లోని ఓ అపార్ట్‌మెంటులో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘటన జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. తొమ్మిది నెలల కిందట మద్రిపాలెం వుడా లేఅవుట్‌లోని ప్రకాష్ రెసిడెన్సీలో వాచ్‌మన్‌గా చేరిన గొల్లపల్లి లక్ష్మణ్.. సెల్లార్‌లోని గదిలో తన భార్య సంధ్య(32), పిల్లలు గౌతమ్(7), అలేఖ్య(5)తో నివాసం ఉంటున్నాడు. వీరిది పాత బొబ్బిలి. మంగళవారం ఉదయం లక్ష్మణ్ మేస్త్రి పనులకు వెళ్లి.. రాత్రి 7.30 – 8 గంటల సమయంలో ఇంటికి వచ్చాడు. రాత్రి భోజనాల తర్వాత సుమారు 10.30 గంటలకు భార్య సంధ్య అపార్ట్‌మెంట్ గేటు వేసింది. తర్వాత అందరూ ఇంట్లో నిద్రపోయారు. అర్ధరాత్రి దాటిన తర్వాత లక్ష్మణ్ లేచి చూసేసరికి.. భార్యాపిల్లలు కనిపించలేదు. దీంతో అపార్ట్‌మెంట్ చుట్టు పక్కల వెదికాడు. ఆచూకీ తెలియకపోవడంతో అపార్ట్‌మెంట్‌వాసులకు ఈ విషయం తెలిపాడు. వారు కూడా పరిసర ప్రాంతాల్లో గాలించారు. అయితే సెల్లార్‌లోని సంపు మూత తీసి ఉండటంతో అనుమానం వచ్చి పరిశీలించారు. తాగునీటిలో మలం కనిపించడంతో.. ఇది ఎలా వచ్చిందని అనుమానంతో కర్ర పెట్టి చూశారు. ఏమీ కనిపించలేదు. పక్క బిల్డింగ్ వాచ్‌మన్ వచ్చి చూడగా లోపల ఏదో కదులుతున్నట్లు గుర్తించాడు. కర్రకు ఇనుప చువ్వ తగిలించి మరింత లోతుగా చూడగా.. వాచ్‌మన్ భార్య మృతదేహం పైకి వచ్చింది. అలా ముగ్గురు మృతి చెందిన విషయం వెలుగు చూసింది. రాత్రి 3 గంటల సమయంలో ఈ విషయాన్ని పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకుని సంపులో నీటిని తోడి మృతదేహాలను బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను కేజీహెచ్‌కు తరలించారు. వెస్ట్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, ఎయిర్‌పోర్టు సీఐ బీఎండీ ప్రసాద్, ఎస్ఐ రామకృష్ణ బుధవారం ఉదయం ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు విచారణలో భాగంగా పిల్లలను స్కూల్‌కు తీసుకెళ్లే ఆటోడ్రైవర్‌ను పోలీసులు విచారించారు.

కుటుంబంలో గొడవల్లేవు : భార్యాభర్తల మధ్య ఎటువంటి తగాదాలు లేవని అపార్ట్‌మెంట్ వాసులు తెలిపారు. పిల్లలు ఆణిముత్యాలని చెప్పారు. వాళ్లు చనిపోవడాన్ని అపార్ట్‌మెంట్ వాసులు జీర్ణించుకోలేకపోతున్నారు. పలువురు మహిళలు కన్నీటిపర్యంతమయ్యారు. పిల్లలు స్థానికంగా ఉండే ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. రెండు రోజుల నుంచి వారిని పాఠశాలకు పంపలేదని ఇక్కడి వారు తెలిపారు. కూరాకుల సామాజిక వర్గానికి చెందిన వారికి ఆర్థిక ఇబ్బందులు లేకపోయినా అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేయడానికి విశాఖ వచ్చారని సంధ్య బంధువులు చెబుతున్నారు. విజయనగరం జిల్లా బొండపల్లి మండలం దేవుపల్లికి చెందిన సంధ్యతో లక్ష్మణరావుకు పదేళ్ల కిందట వివాహమైంది.

వేధింపులతోనేనా..?

సంధ్యకు, ఆమె భర్త పెద్దమ్మ కొడుకుతో వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో అతని బంధువులు.. మృతురాలి కుటుంబ సభ్యులను వేధిస్తున్నట్లు తెలిసింది. ఈ కారణంగా లక్ష్మణ్ కుటుంబం పాత బొబ్బిలి నుంచి తొమ్మిది నెలల కిందట ఇక్కడికి వచ్చేసిందని వారి బంధువులు చెబుతున్నారు. ఇక్కడికి వచ్చినా వారికి ప్రశాంతత లేకుండా చేశారని, తల్లీ, పిల్లలను పొట్టన పెట్టుకున్నారని ఆరోపిస్తున్నారు.

పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నాం

వివాహిత, ఇద్దరు పిల్లలు మృతి ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ కొనసాగుతోంది. ఈ ఘటనను ఆత్మహత్యగా భావిస్తున్నాం. మృతురాలికి ఆమె భర్త పెద్దమ్మ కొడుకుతో వివాహేతర సంబంధం ఉందని బంధువులు ఆరోపిస్తున్నారు. దీనిపై కూడా దర్యాప్తు చేస్తున్నాం. క్లూస్ టీంను రప్పించి ఘటనా స్థలాన్ని పరిశీలించాం. పిల్లలు నిద్రిస్తున్న సమయంలో సంపులో వేసిన తర్వాత ఆమె అందులో దూకి ఉంటుంది.

– అన్నెపు నరసింహమూర్తి, ఏసీపీ

విధుల్లో నిర్లక్ష్యం.. హెచ్‌ఎం సస్పెన్షన్

బీచ్‌రోడ్డు: పాఠశాలకు హాజరు కాకుండా విధుల్లో నిర్లక్ష్యం వహించిన చినగదిలి ప్రధానోపాధ్యాయుడిని జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ సస్పెండ్ చేశారు. బుధవారం ఆమె నగరంలోని పలు పాఠశాలలను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా చినగదిలి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేయగా.. ఆ సమయంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.సూర్యనారాయణ విధులకు హాజరు కాలేదు. ఆయన ఓ వలంటీర్‌ను నియమించి బోధన చేయిస్తుండటంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తరగతుల నిర్వహణ, వర్క్‌బుక్స్ వంటివి పరిశీలించగా.. అన్నీ తప్పులతో ఉండటాన్ని గుర్తించారు. ఇందుకు బాధ్యుడైన హెచ్‌ఎం సూర్యనారాయణను సస్పెండ్ చేశారు. మిగిలిన ఉపాధ్యాయులకు ఆర్టికల్ ఆఫ్ చార్జ్ ఇచ్చినట్లు డీఈవో తెలిపారు.

వైద్య ఆరోగ్య శాఖలో నకి‘లీలలు’

- స్టాఫ్ నర్సు నియామకంలో విశాఖ డీఎంహెచ్‌వో పేరుతో నకిలీ ఆర్డర్
- ఆర్డర్ చూసి షాకైన సిబ్బంది, పోలీసులకు ఫిర్యాదు
- ఇంకా ఎన్ని ఆర్డర్లు ఉన్నాయోనన్న అనుమానం


మహారాణిపేట : వైద్య ఆరోగ్య శాఖలో నకిలీలు వదిలి పెట్టడం లేదు. ఒక వైపు ఫేక్ సర్టిఫికెట్లు.. మరోవైపు నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లతో వైద్య ఆరోగ్యశాఖను కుదిపేస్తున్నాయి. కొద్ది రోజుల క్రితమే నకిలీ ఆర్డర్ల వ్యవహారం తీవ్ర దుమారం రేపగా.. తాజాగా అదే తరహా మరో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. తాజాగా స్టాఫ్ నర్సు పోస్టు కోసం బి.రమాదేవి అపాయింట్‌మెంట్ ఆర్డర్ విశాఖ డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.జగదీశ్వరరావు పేరుతో రావడం కలకలం రేపుతోంది. గత రెండేళ్లుగా వైద్య ఆరోగ్య శాఖలో వివిధ రకాల పోస్టులను భర్తీ చేస్తున్నారు. ఇప్పటికే మెజార్టీ పోస్టులను భర్తీ చేశారు. ఇదిలా ఉంటే అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం వంతల గ్రామానికి చెందిన బి.రమాదేవి అరకు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో స్టాఫ్ నర్సుగా అపాయింట్‌మెంట్ అందజేసింది. ఆ నియామక పత్రాన్ని పరిశీలన నిమిత్తం మూడు జిల్లాల నోడల్ ఆఫీసర్ అయిన విశాఖ డీఎంహెచ్‌వో కార్యాలయానికి పంపించారు. అందులో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు పేరుతో అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఉండడాన్ని సిబ్బంది గమనించారు. ఆ నియామక జాబితాను పరిశీలించగా అందులో ఆమె పేరు లేనట్లు గుర్తించారు. దీంతో ఆ అపాయింట్‌మెంట్ లెటర్ ఫేక్ అని నిర్ధారణకు వచ్చారు.

గతంలో 11 నకిలీ ఆర్డర్లు గుర్తింపు

ఇదే తరహాలో 2020 నుంచి ఇప్పటివరకు 11 నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లను అధికారులు గుర్తించారు. గత డీఎంహెచ్‌వో డాక్టర్ పి.సూర్యనారాయణ పేరుతో నియామక ఉత్తర్వులు వెలుగు చూశాయి. ముంచంగిపుట్టు, భీమవరం పీహెచ్‌సీ, నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి, చింతపల్లి సీహెచ్‌సీ, సీలేరు పీహెచ్‌సీ ఇలా మరికొన్ని ప్రాంతాల నుంచి వచ్చిన నకిలీ ఆర్డర్లు అధికారులను విస్తుపోయేలా చేశాయి. వారందరిపై పోలీసులకు ఫిర్యాదు సైతం చేశారు. తాజా వ్యవహారంతో వైద్య ఆరోగ్య శాఖలో నకిలీ ఉత్తర్వులతో ఎంత మంది ఉద్యోగాలు చేస్తున్నారన్న అంశం చర్చనీయాంశంగా మారింది.

పోలీసులకు ఫిర్యాదు

రమాదేవి నియామక ఉత్తర్వు నకిలీదని గుర్తించిన డీఎంహెచ్‌వో అధికారులు ఆ విషయాన్ని అల్లూరి జిల్లా అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఆ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు రమాదేవిని పిలిపించి ఆ ఆర్డర్ ఎవరు ఇచ్చారన్న విషయంపై ప్రశ్నించారు. మన్యం ప్రాంతానికి చెందిన బి.ఎస్.రాజు రూ.2.50 లక్షలు తీసుకొని ఆర్డర్ ఇచ్చారని ఆమె అధికారులకు లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చింది. దీనిపై అల్లూరి జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ టి.విశ్వేశ్వరనాయుడు జి.మాడుగుల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రమాదేవికి తాను ఆర్డర్ ఇవ్వలేదని విశాఖ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఇలాంటి నకిలీ ఆర్డర్లు ఎక్కువగా మన్యం ప్రాంతం నుంచి వస్తున్నాయన్నారు.



డీఎంహెచ్‌వో పేరిట నకిలీ ఉత్తర్వుల కాపీ

ఖబడ్దార్ బండారు

- దళితుల భూముల జోలికొస్తే సహించేది లేదు
- నీచ రాజకీయాలు మానుకో..
- టీడీపీ నేత వ్యాఖ్యలపై దళిత రైతుల ధ్వజం



బండారు సత్యనారాయణమూర్తి తీరుపై అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళితులు

సింహాచలం: దళితుల భూముల జోలికొస్తే సహించేది లేదని, తగిన బుద్ధి చెబుతామని మాజీ మంత్రి, టీడీపీ నేత బండారు సత్యనారాయణమూర్తిని పెందుర్తి మండలం వాలిమెరక జుత్తాడకు చెందిన దళిత రైతులు హెచ్చరించారు. ఆయన తీరును ఎండగడుతూ, నీచ రాజకీయాలు మానుకోవాలని హితవు పలుకుతూ బుధవారం పెందుర్తి ఎంపీడీవో కార్యాలయం దరి ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. దళిత రైతులు మాట్లాడుతూ వాలిమెరక జుత్తాడలోని తమ స్థలానికి సంబంధించి కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 7న బండారుపై ఫిర్యాదు చేశామన్నారు. రెవెన్యూ సర్వే నంబర్ 98, 99ల్లో తమ తాతలు, తండ్రుల దగ్గర నుంచి సుమారు 45 ఏళ్లుగా జీడి, మామిడి తోటలు వేసుకుని వాటి ఫలసాయాన్ని పొందుతున్నామన్నారు. 2016లో బండారు సత్యనారాయణమూర్తి పెందుర్తి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మా అధీనంలో ఉన్న సర్వే నంబర్ 98లోని సుమారు 7 ఎకరాల భూమిని లాక్కొని.. టీడీపీ చెందిన స్థానిక నాయకులతో తమపై దాడి చేయించారని, కేసులు పెట్టించారని, బైండోవర్ చేసి చిత్రహింసలకు గురిచేశారని గుర్తుచేశారు. 2019లో ముఖ్యమంత్రి అయిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘పేదలందరికీ ఇళ్లు’ కార్యక్రమంలో భాగంగా దళిత రైతులను ఒప్పించారన్నారు. తమ సాగులో ఉన్న 4 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం తీసుకుని మిగిలిన 2.5 ఎకరాలను దళిత రైతులకే కేటాయించిందని చెప్పారు. స్థానిక గ్రామ పెద్దలు, ఎంపీటీసీ, సర్పంచ్, తహసీల్దార్, ఆర్‌డీవో, జేసీల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగిందన్నారు. అటువంటి స్థలంపైన, దళితులపైన బండారు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సర్వే నంబర్ 58/2పై చేసిన ఆరోపణను ఖండిస్తూ.. 2016లో బండారు సత్యనారాయణమూర్తి, ఆయన కొడుకు అప్పలనాయుడు సహకారంతో పులగానిపాలెం టీడీపీ నాయకులు, వాలిమెరకకు చెందిన టీడీపీ ఎంపీటీసీ కలిసి ఈ స్థలాన్ని విక్రయించినట్లు తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి డిప్యూటీ తహసీల్దార్(డీటీ) రంగలక్ష్మికి వారు వినతిపత్రం అందజేశారు. దళిత రైతులు ముప్పల శ్రీను, కాటిపల్లి అప్పారావు, ముప్పల అప్పారావు, కాటిపల్లి లక్ష్మణరావు, ముప్పల పెద్ద అప్పారావు, ముప్పల రమణ తదితరులు పాల్గొన్నారు.

వారాహి యాత్ర.. అంతా రహస్యం!

- పవన్ టూర్ షెడ్యూల్‌పై గోప్యం
- జనవాణి కార్యక్రమంపైనా అదే గుట్టు
- వివరాలు వెల్లడించని జనసేన నేతలు



వారాహి వాహనం

సాక్షి, విశాఖపట్నం: అంతా రహస్యం.. పవన్ కల్యాణ్ చేపడుతున్న మూడో విడత వారాహి విజయ యాత్ర అంతా గోప్యం..! గురువారం నుంచి 19వ తేదీ వరకు జనసేన అధినేత పవన్ ఉమ్మడి విశాఖలో వారాహి విజయ యాత్రను నిర్వహిస్తున్నారు. అయితే ఆయన యాత్ర ఏ రోజు? ఎక్కడ? ఉంటుందో ఆ పార్టీ నాయకులు వెల్లడించకుండా గోప్యత పాటిస్తున్నారు. సాధారణంగా ఏ పార్టీ అధినేత పర్యటన జరిపినా వాటి వివరాలను ముందుగానే ప్రకటిస్తారు. కానీ అందుకు భిన్నంగా వారాహి యాత్రను అంతా రహస్యంగానే ఉంచుతున్నారు. పవన్ తన యాత్రలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన విధ్వంసాలను, అవినీతి, అక్రమాలపై క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తారని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. వాటి వివరాలనూ గుట్టుగానే ఉంచారు. అంతేకాదు.. ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు ఉద్దేశించిన జనవాణి కార్యక్రమాన్ని నగరంలో చేపడతారని చెప్పారు. అదెక్కడో? ఎప్పుడో? ఏ సమయానికో చెప్పకుండా గోప్యతనే పాటిస్తున్నారు. దీనిపై జనసేన నాయకులు మాట్లాడుతూ.. ఒక రోజు ముందుగా అధిష్టానం నుంచి యాత్ర షెడ్యూలు వస్తుందని, అప్పటి వరకు తాము ఏ వివరాలు చెప్పలేమని చెబుతున్నారు. మరోవైపు అధిష్టానం నుంచి ఆ పార్టీ నాయకులకూ యాత్ర షెడ్యూలు ముందుగా తెలియకుండా జాగ్రత్త పడుతున్నారన్న ప్రచారమూ ఉంది. పవన్ కల్యాణ్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్టు చెప్పుకునే వారాహి యాత్ర షెడ్యూల్‌పై గోప్యత ఎందుకోనన్నది చర్చనీయాంశంగా మారింది.

పవన్ సభకు షరతులతో అనుమతి

జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మూడో విడత వారాహి విజయ యాత్ర విశాఖ జిల్లాలో గురువారం నుంచి ప్రారంభం కానుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి శివశంకర్, మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తెలిపారు. బుధవారం మీడియా సమావేశంలో యాత్ర గురించి వివరించారు. ఈనెల 19 వరకు ఉమ్మడి విశాఖ జిల్లాలో ఈ యాత్ర ఉంటుందని, 15న మంగళగిరిలో జెండా వందనం చేస్తారన్నారు. యాత్రలో భాగంగా గురువారం సాయంత్రం 5 గంటలకు జగదాంబ జంక్షన్‌లో జరిగే బహిరంగ సభలో పవన్ కల్యాణ్ ప్రసంగిస్తారన్నారు. ఈ సభకు పోలీసులు షరతులతో కూడిన అనుమతులిచ్చారన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సభ నిర్వహిస్తామన్నారు. కొన్నిచోట్ల పోలీసులు సెక్షన్ 30 పేరిట అడ్డంకులు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో పీఏసీ సభ్యుడు కోన తాతారావు, ఆ పార్టీ నాయకులు ముగి శ్రీనివాసరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బాలుర వసతి గృహంలో కొట్లాట

- ఇద్దరికి తీవ్ర గాయాలు

బీచ్‌రోడ్డు: చినగదిలి దీనదయాళ్‌పురంలోని బాలుర వసతి గృహంలో జరిగిన కొట్లాటలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా.. మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వసతి గృహం సూపరింటెండెంట్ వీరయ్య తెలిపిన వివరాలివీ.. నాలుగో పట్టణ స్టేషన్ పరిధిలో ఓ కేసులో అరెస్ట్ అయిన ఐదుగురు బాలురను మంగళవారం రాత్రి వసతి గృహానికి తీసుకొచ్చారు. అప్పటికే అక్కడ ఉన్న 38 మంది బాలురు.. బుధవారం ఉదయం ఈ ఐదుగురిని హేళన చేస్తూ మాట్లాడారు. దీంతో ఇరువర్గాల మధ్య గొడవ మొదలైంది. విషయం తెలుసుకున్న సూపరింటెండెంట్ వసతి గృహానికి చేరుకుని ఆరిలోవ పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకుని రెండు గ్రూప్‌లను మందలించారు. ఈ ఘటనలో మంగళవారం రాత్రి చేరిన వారిలో ఇద్దరికి తీవ్రంగా, ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని 108లో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు.. ఓ బాలుడి ముక్కుకి తీవ్ర గాయం కావడంతో ఈఎన్‌టీ ఆస్పత్రిలో చేర్పించారు. మరో బాలుడు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. మిగిలిన ముగ్గురిని వసతి గృహానికి తీసుకొచ్చారు.

మణిపూర్ ఘటనపై నిరసనగా ఫ్లాష్‌మాబ్



నిరసన తెలుపుతున్న లాజరస్ ప్రతినిధులు

సీతమ్మధార: మణిపూర్‌లో జరిగిన ఘటనను నిరసిస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బుధవారం లాజరస్ చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ జరిగింది. మణిపూర్‌లో విభిన్న జాతులు, మతాల మధ్య కొంతకాలంగా జరుగుతున్న హింసాకాండలో మహిళలపై అత్యాచారాలు చేయడం అమానుషమని సంస్థ ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తంచేశారు. అక్కడ జరుగుతున్న పరిణామాలను నిరసిస్తూ ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు.